క్లుప్తంగా

14 నుంచి చదరంగం పోటీలు

తాండూర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 14నుంచి కుమార్ బ్రదర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ చదరంగం పోటీలను నిర్వహిస్తున్నట్లు కోచ్ సమ్మయ్య తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో ఐదు రౌండ్లలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. అండర్ 9, అండర్ 11, అండర్ 13, అండర్ 15, అండర్ 17 విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు రూ.150 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490141675 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సిర్సాలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామపంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రను సర్పంచ్ పెద్దింటి పున్నంచంద్ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్‌భారత్, గరీబ్‌కళ్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ వంటి పథకాలపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించి పథకాలతో లబ్ధిపొందిన వారితో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సదయ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

‘తప్పులు లేకుండా నమోదు చేయండి’

నెన్నెల: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో, ఎంఆర్‌సీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న డేటాఎంట్రీ ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఈ నెల 17వ తేదీలోగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండల వ్యాప్తంగా 7,688దరఖాస్తులు వచ్చాయని ఏ ఒక్క దరఖాస్తు కూడా తప్పుగా నమోదు చేయకుండా అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వరలక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ గణేష్ ఉన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

భీమిని: మండలంలోని చిన్నగుడిపేటలో నూతనంగా నిర్మించే పెద్దమ్మతల్లి ఆలయ భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ముదిరాజ్ సంఘం సహకారంతో గ్రామానికి చెందిన దాతలు అందరూ కలిసి రూ.35లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సూరం మొండయ్య, బానక్క, ఎర్రం శంకర్, లక్ష్మి, గంగ కిషోర్‌శర్మ, ముదిరాజ్ సంఘం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టేస్టీ.. మిల్లెట్ ఫుడ్..!

- చిరుధాన్యాల ఆహారంపై ప్రజల ఆసక్తి
- మెప్మా మహిళా సంఘం ద్వారా తయారీ, అమ్మకాలు
- పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రూ.10.65లక్షల రుణం
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉపయోగకరం

సండే స్పెషల్



మిల్లెట్స్‌తో చేసిన పదార్థాలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

మంచిర్యాలటౌన్: ఆధునిక జీవనశైలితో, ఉరుకులు, పరుగుల జీవితంలో వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. దీంతో ప్రజలు ఆరోగ్యాన్ని అందించే ఆహారాన్ని తినేందుకు మొగ్గు చూపుతున్నారు. బీపీ, షుగర్ వ్యాధులు నేడు చిన్న వయస్సు వారికి రావడం, దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉండేందుకు, వచ్చిన వారికి అదుపులో ఉండేందుకు ప్రస్తుతం తినే ఆహారానికి స్వస్తి చెప్పి, పూర్వకాలంలో తినే ఆహారం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. కొర్రలు, సామలు, అండు కొర్రలు, అరికెలు, ఊదలు, వరిగ ఇలా సంప్రదాయ పంటలకు ఇప్పుడిప్పుడే ప్రాధాన్యం పెరుగుతోంది. చిరుధాన్యాలను(మిల్లెట్స్) తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా, వచ్చినా అదుపులో ఉండడంతో పాటు, ఆరోగ్యానికి ఎంతో మంచివి కావడంతో వీటిని తింటున్నారు. చిరుధాన్యాలు ప్రాచీన కాలం నుంచి మానవ పరిణామక్రమంలో ప్రముఖ పాత్ర పోషించాయి. వీటిలో కాల్షియం, ఐరన్, జింక్, పాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్, విటమిన్ బి, కెరోటిన్ వంటి మూలకాలు ఉండడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.




చిరుధాన్యాలతో చేసిన గారెలు, మురుకులు

ఆరోగ్యానికి మంచి చేసేవని...



అన్నపూర్ణ మిల్లెట్స్ ఫుడ్ పేరిట మేము దీనిని ఏర్పాటు చేశాం. ఆరోగ్యానికి మంచి చేసే చిరుధాన్యాలతో వివిధ రకాల వంటకాలను చేసి, ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతోనే దీనిని ఏర్పాటు చేశాం. ధరలు అధికంగా ఉన్నా, వీటికి ఎక్కువగా డిమాండ్ ఉంది. ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.
దుర్గాభవాని, మిల్లెట్స్ షాపు నిర్వాహకురాలు



రాగులు, జొన్న, చిరుధాన్యాలతో చేసిన లడ్డూలు

డ్రైఫ్రూట్స్, చిరుధాన్యాలతో చేసిన లడ్డూలు

మహిళా సంఘం సభ్యుల చొరవతో..

చిరుధాన్యాలు తినేందుకు నేటి తరం ప్రజలు అంతగా ఆసక్తి చూపించక పోవడం, తినే వారికి మరింత రుచిని అందించేందుకు ఇప్పుడిప్పుడే మిల్లెట్లతో పలు ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయాలను జరుపుతున్నారు. దీనిని గుర్తించిన మంచిర్యాల మున్సిపాలిటీలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) స్వయం సహాయక మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రుణ సాయం, సబ్సిడీని సద్వినియోగం చేసుకుని మంచిర్యాల మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్సులో అన్నపూర్ణ స్వయం సహాయక సంఘానికి చెందిన సభ్యురాలు మిల్లెట్లతో పలు రకాల ఆహార పదార్థాల తయారీ కేంద్రం, విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి ఫుడ్ మైక్రో ప్రాసెసింగ్ మిల్లెట్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) ద్వారా రూ. 10.65 లక్షల రుణాన్ని అందించారు. ఇందులో 35శాతం సబ్సిడీని అందిస్తున్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని గ్రూపులోని ఒక మహిళ మిల్లెట్ల తయారీ, విక్రయ కేంద్రాన్ని ప్రారంభించగా, ఆ గ్రూపులోని సభ్యులతో కలిసి నిర్వహిస్తున్నారు.

ధర ఎక్కువైనా...

చిరుధాన్యాలకు ధర అధికంగా ఉంటుంది. దీంతో వాటితో చేసిన ఆహార పదార్థాలు సైతం ధర అధికంగానే ఉన్నా, ఆరోగ్యానికి మంచిదని పలువురు వీటిని తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చిరుధాన్యాలతో చేసే స్నాక్స్‌ను కట్టెగానుగతో చేసిన నూనెను వాడి సజ్జగారెలు, సజ్జ మురుకులు, జొన్న గారెలు, మురుకులు చేస్తుండగా, ఒక్కో ప్యాకెట్ ధర రూ.100 వరకు ఉంది. జొన్న సజ్జ లడ్డులు కిలోకు రూ.700, పొట్టు పెసర లడ్డు రూ.800, మల్టీ మిలెట్స్ లడ్డు కిలోకు రూ.1,000, గోంద్ లడ్డు రూ.1,200, నల్ల నువ్వులు తాటి బెల్లంతో చేసిన లడ్డు కిలోకు రూ.900, మల్టీ సీడ్స్ లడ్డు రూ. 1,200, బార్లి లడ్డు రూ. 1,000లుగా ఉన్నాయి. షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా తయారు చేసిన లడ్డూలను మిల్లెట్స్‌తో చేసి అమ్మకాలు చేస్తుండగా, అవే చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల పొడులు సైతం పలువురు కొనుగోలు చేస్తున్నారు.

చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్



పూజల్లో పాల్గొన్న వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారిమైసమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న సప్తశతి చండీయాగంలో శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. సర్పంచ్ బొలిశెట్టి సువర్ణ, మాజీ ఎంపీపీ బొలిశెట్టి కనకయ్య, రఘునాథ్, పల్లెరాజు, కందునూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని అభినందించిన ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన చిన్నారి సునార్కర్ ఆరాధ్య ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నీస్ వరల్డ్ రికార్డ్ కూచిపూడి కళావైభవం నృత్య పోటీల్లో పాల్గొంది. మందమర్రికి శనివారం ఎమ్మెల్యే వివేక్ వచ్చిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఇంటి వద్ద చిన్నారిని అభినందించారు. భవిష్యత్‌లో మంచి నృత్య కళాకారిని కావాలని ఆకాంక్షించారు. సీసీసీ నస్పూర్‌కి చెందిన కాపుడి వసుధ (శ్రీనిధి నృత్యాలయం) వద్ద శిక్షణ పొందుతున్న ఆరాధ్య తండ్రి సునార్కర్ రాంబాబు మంచి కొరియోగ్రాఫర్‌గా రాణిస్తున్నారు.

కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

నెన్నెల: ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులు సబ్సిడీ పొందుట కోసం వారి కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే విద్యుత్ ఏఈ కార్యాలయం నెన్నెలలో అందజేయాలని విద్యుత్ ఏఈ మల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ మీటర్ ఎవరి పేరు మీద ఉంటే వారే కులధృవీకరణ పత్రం అందజేయాలన్నారు. దళిత, గిరిజనులకు కులధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో రెవెన్యూ సిబ్బంది సహకరించాలని కోరారు.

బీసీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే నామినేటెడ్ పదవుల్లో జనాభా ప్రాతిపదికన బీసీల ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. సంఘం నాయకులు శనివారం సీసీసీ కార్నర్ వద్ద మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు సముచిత స్థానం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు శ్రీపతి రాములు, జైపాల్ సింగ్, అంకం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రెనిన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఇస్లాంపుర రోడ్ నంబర్ 01లో అన్ని వసతులు, అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన రెనిన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులకు, వ్యాస్క్యులర్ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు మంచిర్యాలలో అందుబాటులోకి రావడం సంతోషమన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు నెఫ్రాలజిస్టు శ్రావణి, వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ వేణుకుమార్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ మూర్తి, జనరల్ సెక్రెటరీ డాక్టర్ చంద్రదత్, వైద్యులు సాల్మన్‌రాజ్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సింగరేణి కాలరీస్ డిప్యూటీ మేనేజర్ ఏవీ రెడ్డి మేనేజర్ తిరుపతి, వార్డు కౌన్సిలర్ మినాజ్, కాంగ్రెస్ నాయకులు తూముల నరేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: బోరంపల్లిలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న హైవోల్టేజ్ విద్యుత్ తీగలను తొలగించి, కొత్తవి వేయకుండా చూడాలని శనివారం తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా తమ ఆవేదన పట్టించుకోకుండా కొత్తవాటికి అనుమతులు ఇస్తున్నారని, ఇళ్లలో విద్యుత్ షాక్‌లకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణదాస్, ప్రదీప్, కుబేర్, వసంత్, పొచయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల బర్లగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసే సీసీ రోడ్డు పనులకు శనివారం ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రౌతు వెంకటేష్, వార్డు సభ్యురాలు మమత, కో–ఆప్షన్ సభ్యుడు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట: మండలంలోని దుబ్బగూడెం ఓసీ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. ఆర్అండ్ కాలనీలో నిర్మిస్తున్న హనుమాన్, పోచమ్మ ఆలయాలకు శనివారం ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యలపై వివరించడంతో పాటు, తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరగా సమస్యలు పరిష్కరించి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానన్నారు. 2013చట్టం ప్రకారం ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించిన విషయమై అధికారులతో మాట్లాడి, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. యాజమాన్యంతో మాట్లాడి ఆర్అండ్ఆర్ కాలనీ పనులు త్వరగా పూర్తి చేయించి ప్లాట్ల పంపిణీ త్వరగా జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌కుమార్, మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, పీఏసీఎస్ చైర్మన్ నీలరాంచందర్, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

జైపూర్: మండలంలోని ఎల్కంటి గ్రామానికి చెందిన మద్దుల భూమయ్యకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎల్కంటి శివారులోకి శుక్రవారం ఎద్దు మేత కోసం వెళ్లి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి మృతి చెందగా శనివారం రైతు భూమయ్య గమనించినట్లుగా తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని నష్టపరిహారం అందించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న డ్రైవర్, క్లీనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ విద్యాసంస్థల డ్రైవర్ క్లీనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం డ్రైవర్ క్లీనర్ల సమావేశం నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.



తాండూర్‌లో ఆన్‌లైన్ నమోదు



నస్పూర్: ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్



బెల్లంపల్లి: దరఖాస్తు ఇస్తున్న పురప్రజలు

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

భీమారం/నస్పూర్/తాండూర్/చెన్నూర్‌రూరల్/జన్నారం/బెల్లంపల్లిరూరల్/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ఆరు గ్యారంటీల పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఆఖరి రోజు లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం దరఖాస్తులను పరిశీలిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. దరఖాస్తులు ఇవ్వనివారు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. హాజీపూర్‌లో ఆన్‌లైన్ ప్రక్రియను జెడ్పీ సీఈఓ కె.నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో నస్పూర్‌లో మున్సిపల్ కమిషనర్ రమేశ్, చెన్నూర్‌లో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, భీమారంలో ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, బెల్లంపల్లిలో ఎంపీడీవో రాజేందర్, చెన్నూర్‌లో ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీవో అజ్మత్ అలి, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఏవో కవిత, జన్నారంలో ఎంపీడీవో అరుణరాణి, హాజీపూర్‌లో తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, నాయబ్ తహశీల్దార్ హరిత, గిర్దావర్‌లు ప్రభు, మంగ తదితరులు పాల్గొన్నారు.



హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయంలో...



బెల్లంపల్లిరూరల్: పరిశీలిస్తున్న ఎంపీడీవో



చెన్నూర్‌రూరల్: ఎర్రగుంటపల్లిలో...



జన్నారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో



చెన్నూర్: ఆరో వార్డులో...



పద్మనపల్లిలో శోభాయాత్ర



భీమారం: కాజిపల్లిలో పల్లకి ఊరేగింపు



జిల్లా కేంద్రంలో శోభాయాత్ర



కోటపల్లి: రాంపూర్‌లో ఊరేగింపు

రాములోరి అక్షింతల ఊరేగింపు

మంచిర్యాలఅర్బన్/భీమిని/కోటపల్లి/భీమారం/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలకు జిల్లాకేంద్రంలో, పలు మండల కేంద్రాల్లో భక్తులు శనివారం ఊరేగింపు నిర్వహించారు. కోలాటాలు ఆడుతూ.. డీజే చప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ భక్తులు సందడి చేశారు. అనంతరం ఇంటింటా పంపిణీ చేశారు.



బెల్లంపల్లి: అక్షింతలతో రామ భక్తులు



భీమినిలో...

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ కృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘ సభ్యులకు బ్యాంకు వారు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని, మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. అధికారులు సైబర్‌మోసాలు, బ్యాంకు సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పించారు. కళాకారులతో కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ముత్యంపల్లి బ్యాంకు మేనేజర్ రాజ్ అన్సారీ, ఫీల్డ్ ఆఫీసర్ సాయికృష్ణ, ఏపీఎం వెంకటేష్, సీసీలు రాజమల్లు, లక్ష్మి, వారద, తదితరులున్నారు.